క్లుప్తంగా

700 మందికి కళ్లజోళ్లు పంపిణీ



దాచేపల్లి : కంటి శుక్లముల ఆపరేషన్ చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లజోళ్లను నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పంపిణీ చేశారు. ది మధర్ స్వచ్ఛంద సేవా సంస్థ, శంకర కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఇటీవల ఉచిత వైద్యశిబిరం నిర్వహించి 700 మందికి కంటి శుక్లముల ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లజోళ్లను జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డీఎల్‌డీఓ గ్రబూనాయక్, మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, సంస్థ అధ్యక్షురాలు నాగెండ్ల సుమతీ రత్నం చేతుల మీదుగా అందజేశారు. వైద్యశిబిరం నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేసిన సంస్థ అధ్యక్షురాలు సుమతీరత్నంను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభారాణి, ఈఓపీఆర్డీ జోష్‌రాజు, డీఎల్పీఓ హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, ప్రిన్సిపల్ చంద్రశేఖర్, నాయకులు నెల్లూరి రామస్వామి, మందపాటి కృష్ణారెడ్డి, కొరిమెళ్ల సైదయ్య, ఐలాపురం నరసింహారావు, నడికుడి సూర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఎల్‌ఓలకు సమావేశం

పిడుగురాళ్ల: పట్టణంలోని బీఎల్‌ఓలకు పట్టణంలోని 12వ సచివాలయ పరిధిలోని నీళ్ల ట్యాంక్ వద్ద నిర్వహిండం జరుగుతుందని తహసీల్దార్ చక్రవర్తి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని బూత్ లెవల్ ఆఫీసర్లకు మీటింగ్ నిర్వహించడం, వారికి ఓటర్ల పరిశీలనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి

నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్ షేక్ బడేజానీ

గురజాల : మణిపూర్‌లో జరిగిన సామూహిక అత్యాచారాలు, సామూహిక దాడులు చేసిన దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్ షేక్ బడేజానీ డిమాండ్ చేశారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన



మాచర్ల: ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఆగస్టు నెల నుంచి పౌష్టికాహారాన్ని బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రతి ఒక్కరూ అందించాలని, ఎక్కడా లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా చూడాలని మాచర్ల శిశు సంక్షేమ పర్యవేక్షణాధికారి లీలావతి శుక్రవారం అన్నారు. రెండు రోజులుగా వివిధ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు మున్సిపల్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి లబ్ధిదారుని యాప్‌లో డౌన్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ ద్వారా ఆగస్టు 4 నుంచి బియ్యం, నిత్యవసర వస్తువులు ప్రభుత్వం ఆదేశాల మేరకు కిట్ రూపంలో అందించాలన్నారు. ఇదంతా ఆన్‌లైన్ ద్వారా పట్టణ, రూరల్ మండలాల వారికి సిడిపిఓ, సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అశ్రద్ధ చేయకుండా అవగాహన కలిగి బాలింతలు, గర్భిణుల పేర్లు నమోదు చేసి సేవ చేసి ముందంజలో ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు హాజరయ్యారు.

కంటి వైద్య శిబిరం



మాచర్ల: నియోజక వర్గంలో ఆయా ప్రాంతాల్లో దత్తత తీసుకున్న వార్డులు, గ్రామాల్లో పట్టణానికి చెందిన మీనాక్షి పీఎస్ఆర్ ఆంజనేయులు కంటి వైద్యశాల చైర్మన్ చిరుమామిళ్ళ కృష్ణయ్య, డైరెక్టర్ చెరుకూరి నరసింహారావు, వైద్యురాలు సుస్మితల ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో మాచర్ల రూరల్ కంభంపాడు, పట్టణంలోని శెరిన్‌కాలనీ ప్రాంతంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రెండు రోజుల పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా పీఎస్ఆర్ అంజనేయులు మీనాక్షి కంటి వైద్యశాలలో ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందన్నారు.

త్యాగాలకు ప్రతీక మొహర్రం

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- పీర్లకు దట్టీలు సమర్పించిన ఎమ్మెల్యే
- కులమతాలకతీతంగా మొహర్రం వేడుకలు



దట్టీలతో పీర్ల చావిడి వద్దకు వస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : త్యాగాలకు ప్రతీకగా మొహర్రం నిలిచిందని గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మొహర్రం పండుగ సందర్భంగా నగర పంచాయతీలోని పీర్ల చావిడిలను శుక్రవారం రాత్రి ఆయన సందర్శించారు. చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌భాషా ఆధ్వర్యంలో పీర్లకు దట్టీలు సమర్పించే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాసు చేతుల మీదుగా చేయించారు. బొరుగులు, బెల్లంను ఎమ్మెల్యే కాసు తలపై పెట్టుకుని మేళతాళాలతో దట్టీలతో ప్రదర్శనగా చావిడిల వద్దకు చేరుకున్నారు. బొడ్రాయి సెంటర్, లైబ్రరీ సెంటర్‌లలోని గంధం పీర్లు, బ్రహ్మణ గడ్డలోని చావిడిలలోని కట్టి పీర్లకు బెల్లం, బోరుగులు, దట్టీలను ఎమ్మెల్యే కాసు సమర్పించారు. ముస్లిం మతపెద్దలు ఎమ్మెల్యే కాసును శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ..కులాలు, మతాలకు అతీతంగా అన్నదమ్ముల్లా కలిసి మెలసి మొహర్రం పండుగను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగే మొహర్రం పండుగ వేడులకన్నా దాచేపల్లిలో జరిగే ఈ పండుగ వేడుకలు ప్రత్యేకతను చాటుకుంటున్నాయని ఆయన తెలిపారు. పీర్ల చావిడిల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాసు చెప్పారు. ముస్లిం మైనార్టీలకు అన్ని విధాలుగా తాము అండగా ఉంటామని, ముస్లిం, మైనార్టీల కోసం దాచేపల్లిలో బ్రహ్మండమైన ఎయిర్ కండిషన్‌తో కూడిన షాదిఖానా నిర్మిస్తున్నామని, త్వరలోనే షాదిఖానా పనులు పూర్తి చేసి అప్పగిస్తామన్నారు. రంజాన్, బక్రీద్ పండుగల సమయంలో ముస్లిం సోదరులంతా ఒకే చోట కుర్చోని నమాజ్ చేసేందుకు గత ప్రభుత్వాల్లో స్థలం కూడా కేటాయించలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లీం, మైనార్టీ పెద్దల విన్నపం మేరకు ఈద్గాకు స్థలం కూడా కేటాయించి అభివృద్ధి చేస్తునానమని ఎమ్మెల్యే కాసు చెప్పారు. ముస్లిం, మైనార్టీ సోదరులను రాజకీయంగా ఆర్థికంగా బలోపేతం చేస్తామని, ముస్లింను తన పక్కన కుర్చోబెట్టుకుంటున్నాని ఆయన వ్యాఖ్యనించారు. రాబోయే రోజుల్లో కూడా ముస్లిం సోదరులకు అన్ని విధాలుగా మంచే జరిగేలా తనవంతు కృషి చేస్తానని, తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని ఎమ్మెల్యే కాసు అన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌భాషా, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, యార్డు డైరెక్టర్లు బుగ్గల జానీ, యర్రంశెట్టి సైదారావు, మండల కన్వీనర్ కోట కృష్ణ, మాజీ మండల కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, నాయకులు షేక్ డాడీ, జానీభాషా, షేక్ సైదా, షేక్ సైసావలి, ఆదాంషఫీ, అల్లిసా, జానీ పాల్గొన్నారు.



పీర్ల చావిడికి వస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



నూతన వస్త్రాలను తీసుకుని వస్తున్న పిన్నెల్ల వెంకట రామిరెడ్డి

మత సామరస్యానికి పీర్ల పండుగ నిదర్శనం

పిడుగురాళ్లరూరల్: మతసామరస్యానికి పీర్ల పండుగ నిదర్శనం అని గురజాల నియోజకవర్గ శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగ జోనల్ ఇన్‌చార్జి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట రామిరెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని పీర్ల పండగను పురస్కరించుకుని 9వ షరగత్తు రోజున పీర్లను సందర్శించారు. దీనిలో భాగంగా ఇరువురు పీర్లకు నూతన వస్త్రాలను సమర్పించారు. ముందుగా కామేపల్లి గ్రామంలోని షేక్ రంజాన్ వలి ఇంట్లో నూతన అలంకార వస్త్రాలను తీసుకొని బ్రాహ్మణపల్లి గ్రామంలోని పీర్లచావిడి వద్దకు వచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, మాచర్ల మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, బ్రాహ్మణపల్లి సర్పంచ్ మాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

త్యాగాలకు ప్రతీక మొహరం

మాచవరం: త్యాగాలకు ప్రతీక మొహరం పండుగని, వారు నమ్మిన సిద్ధాంతాల కోసం ప్రాణత్యాగం చేసిన వీరుల త్యాగాలకు గుర్తుగా పీర్ల పండుగను జరుపుకోవడం జరుగుతుందని గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ యువ నాయకుడు షేక్ షరీఫ్ తన సొంత ఖర్చులతో సుమారు రూ.6 లక్షలతో నూతనంగా నిర్మించిన పీర్ల చావిడిని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఊరేగింపుగా వెళ్లి పీర్లకు బెల్లం కానుకగా అందించారు. ముజాకర్‌తో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, జెడ్పీటీసీ శివాయాదవ్, మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, యూత్ కన్వీనర్ మద్దు ప్రసాద్, గ్రామ అభివృద్ధి కమిటీ కమిటీ చైర్మన్ ఆంజినేయులు, ఎంపీటీసీ సత్యనారాయణ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పాల్గొన్నారు.

మాచర్లను క్లీన్‌అండ్ గ్రీన్ చేయడమే మున్సిపాల్టీ ధ్యేయం

మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్, కమిషనర్ రమణబాబు

మాచర్ల: పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయానికి వచ్చే ప్రజలు, ఉద్యోగులు అందరికీ సౌకర్యంగా ఉండేలా రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించిన మరుగుదొడ్లు ప్రతి ఒక్కరికీ ఉపయోగపడతాయన్నారు. శుక్రవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన మరుగుదొడ్లను మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్, కమిషనర్ రమణబాబులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాచర్లలో క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచేందుకు ప్రతి బహిరంగ ప్రదేశంతో పాటు, కార్యాలయ ప్రాంగణంలో సందర్శకులు, ఉద్యోగుల సౌకర్యార్థం టాయిలెట్‌లు నిర్మించడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో పట్టణంలో ఎక్కడా ఆయా ప్రాంతాల్లో టాయిలెట్స్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డు కౌన్సిలర్లు, ఉద్యోగులు, సిబ్బంది, మెప్మా ప్రాజెక్టు ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రతి వార్డును అభివృద్ధి చేస్తాం

మాచర్ల: పట్టణంలోని ప్రతి వార్డులో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేసేందుకు సమష్టిగా పురపాలక సంఘ పాలక వర్గం పనిచేస్తుందని మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్ అన్నారు. శుక్రవారం పాత మాచర్లలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో రూ. 15 లక్షలతో నిర్మించే రోడ్లు, డ్రైనేజీ పనులకు మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్, కమిషనర్ ఈవి రమణబాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, కౌన్సిలర్ కె పిచ్చయ్య లు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కిషోర్ మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు, క్లీన్ అండ్ గ్రీన్ తో పాటు పలు కమ్యూనిటీ హాళ్ళు అన్ని వర్గాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ పీఆర్కే ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పట్టణాభివృద్ధిలో ఎప్పుడూ రాజీపడకుండా పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పోలూరి నరసింహారావు మాచర్ల చిన ఏసోబు, కౌన్సిలర్లు మదార్‌సాహెబ్, మాచర్ల సుందరరావు, బత్తిన వేణు, కో ఆప్షన్ మెంబర్ అనంతరావమ్మ, తేరాల సిద్దయ్య యాదవ్, అల్లి జీవన్, షేక్ యాసిన్, ఏఈ సామేల్ పలువురు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు విధి నిర్వహణలో అలసత్వం వద్దు

ఆర్డీఓ అద్దెయ్య

గురజాల : బూత్ లెవల్ ఆఫీసర్లు విధి నిర్వహణలో ఎవరూ అలసత్వం వహించవద్దని రెవెన్యూ డివిజన్ అధికారి కె అద్దెయ్య సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మంగళవారం జరుగు బీఎల్‌ఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ వెరిఫికేషన్ చేస్తున్నారని ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే సమస్యకు పరిష్కారం చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. అదే విదంగా నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు వారి సమస్యలు తెలియజేయాలన్నారు. ఏమైనా ఫిర్యాదు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటర్లు మార్పులు, చేర్పులు విషయంలో బీఎల్‌ఓలు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మీసాల దానియేలు, ఆర్డీఓ కార్యాలయం పరిపాలనాధికారి శనగల శివనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, వైస్ చైర్ పర్సన్ మన్నెం కన్యాకుమారి ప్రసాద్, మాజీ ఎంపీపీ వీరంరెడ్డి అమరారెడ్డి, బీఎల్‌ఓలు పలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడమే లక్ష్యం

డాక్టర్ రాజ్‌కుమార్



పీహెచ్‌సీలో ఎంపీపీతో రోగులకు అందుతున్న సేవలను చర్చిస్తున్న బృందం

రెంటచింతల: దేశంలోని ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు ఎన్‌క్యూఏఎస్(జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు) కమిటీ సభ్యులు డాక్టర్ రాజ్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆయన తనిఖీ బృందంతో కలిసి సందర్శించారు. ఆస్పత్రిలో నెలకున్న వాతావరణాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను, ఎంత ఓపి వస్తోందని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రోగులకు జాతీయ నాణ్యాతా ప్రమాణాల ప్రకారం ఎల్లప్పుడూ నాణ్యమైన సేవలను పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో అందించాలన్నారు. ఆస్పత్రిలో భద్రత, సంరక్షణ, నాణ్యతను నిర్ధారించడానికి జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నాణ్యతలో రోగి భద్రత కీలకమైన అంశంమని ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో అంతర్భాగమన్నారు. ఆస్పత్రి సిబ్బంది ఆస్పతికి వచ్చే ప్రజలకు మెరుగైన(నాణ్యమైన) సేవలు అంధించడానికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ఎంపీపీ దాసరి చౌడేశ్వరి ఆస్పత్రి అభివృద్ధికి చేపట్టిన పనులను వివరించారు. ముందుగా పీహెచ్‌సీ ముందు ఏర్పాటు చేసిన విశ్వమాత మదర్‌థెరీసా విగ్రహాన్ని డాక్టర్ రాజ్ కుమార్ ఆవిష్కరించి ఆమె చూపిన ప్రేమ, సేవ చేయాలనే ఒక గుణం అనేకమందిని ప్రేరేపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌క్యూఏఎస్ సభ్యులు ఆరోకియామేరి, మలేరియా అధికారి సీహెచ్ అంకమ్మరావు, సీహెచ్‌ఓ పూజల నాగేశ్వరరావు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే జగనన్న సురక్ష

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



సర్టిఫికెట్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, అధికారులు

రెంటాల(రెంటచింతల): రాష్ట్రంలోని అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అంధించి వారికి మేలు చేయడానికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించినట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని రెంటాల గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వతంత్ర భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు క్షేత్రస్థాయిలోనే వారికి అవసరమైన వివిధ రకాల ధృవీకరణ పత్రాలను ఉచితంగా అందచేయడమే కాకుండా వారి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. ప్రారంభించిన విప్లవాత్మకమైన ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలకు ఉచితంగా కులం, ఆదాయం, రైస్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు తదితర 11 రకాల సేవలను అందించి వారి సమస్యలు తెలుసుకుని వాటిని అక్కడి కక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరువచేయడంతో పాటు క్షేత్రస్థాయిలో వారికి పలు సేవలను అంధిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ రకాల సేవలకోసం, పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 132 ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ కట్టికోట పుల్లారావు, విశ్రాంత సర్పంచ్ చింతమళ్ళ కిరణ్‌కుమార్, ఉప సర్పంచ్ గాలి లక్ష్మారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, ఈవోపీఆర్డీ సీహెచ్ రామచంద్ర రావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఎంపీటీసీ పినబోయిన నాగలక్ష్మి, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

దుర్గి నూతన ఎస్‌ఐగా శివ



దుర్గి: పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు దుర్గి మండల ఎస్‌ఐగా శివను నియమించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఆదేశాలు విలువడ్డాయి. 2020 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐ శివ ప్రస్తుతం కోటప్పకొండ అవుట్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ఎస్‌ఐ కె సతీష్ సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐ ఎం శివ మాట్లాడుతూ శనివారం బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

పేద విద్యార్థులకు లాప్ టాప్, చెక్కులు పంపిణీ

పిడుగురాళ్ల: పల్నాడు హాస్పటల్స్ అధినేత చింతలపూఇ అశోక్‌కుమార్ తనయుడు ఆరవ్‌చౌదరి 7వ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ల్యాప్‌టాప్, చెక్కుల పంపిణీ చేశారు. చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతలపూడి శ్రీనివసారావు ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయంతోపాటు టాప్‌ని అందజేశారు. జానపాడు గ్రామానికి చెందని కోకిల అనే విద్యార్థినికి రూ. 50 వేల విలువ చేసేలాప్ టాప్, గురజాలకు చెందిన నల్లా లిప్సినకు పదివేలు, విజయ కృష్ణకు పది వేలు, మీరావలికి ఐదు వేలు చెక్కులను చింతలపూడి బ్రదర్స్ అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమ్య హారిక, హాస్పటల్ సిబ్బంది, చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు సభ్యులు తదితరులు ఉన్నారు.

పిడుగురాళ్ల నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

పిడుగురాళ్ల: అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీస్ నంబర్ 36012ను ఏర్పాటు చేసినట్లు పిడుగురాళ్ల డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు తెలియజేశారు. జులై 30వ తేదీ రాత్రి 9 గంటలకు పిడుగురాళ్ల నుంచి బయలుదేరి ప్రయాణికులకు 31వ తేదీ ఉదయం శ్రీకాళహస్తి, మధ్యాహ్నం కాణిపాకం, విఘ్నేశ్వరస్వామి, సాయంత్రం సిరిపురం గోల్డెన్ టెంపుల్ దర్శనం చేయిస్తామని తెలియజేశారు. 31వ తేదీ రాత్రికి బయలుదేరి ఆగస్టు 1వ తేదీ పౌర్ణమి రోజు ఉదయం అరుణాచలం చేరుకుని గిరి ప్రదక్షిణ అనంతరం దర్శనం చేసుకుంటారని తెలిపారు. 1వ తేదీ రాత్రి బయలుదేరి 2వ తేదీ ఉదయం పిడుగురాళ్ల చేరుకుంటారన్నారు. సూపర్ లగ్జరీ బస్సు టిక్కెట్ ధర రూ. 2550 లని తెలియజేశారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయవద్దు

ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి



కర పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ

కారెంపూడి: ఇళ్లలోని వ్యర్థాలను క్లాప్ మిత్రాలకు మాత్రమే అందించాలని ఎక్కడపడితే అక్కడ పడేయ వద్దని ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి కోరారు. మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛ భారత్ గ్రామీణ ఫేజ్ 2 కింద పంచాయతీ కార్యదర్శులకు సిబ్బందికి ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ శారదాశ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాకాలం సీజన్‌లో దోమలు ప్రబల కుండా మురుగు నీరు నిల్వ ఉండకుండా పంచాయతీ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మురుగు కాల్వలను ఎప్పటి కప్పుడు శుభ్రం చేయిస్తూ కాల్వలో దోమ లార్వా నివారణ మందును పిచికారీ చేయించాలన్నారు. ఇళ్లలోని వ్యర్థాలను క్లాప్ మిత్రాలకు అందించి తడి పొడి చెత్తగా దానిని వేరుచేసి కంపోస్ట్ తయారీకి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రెండవ మరుగుదొడ్డి అవసరమైన వారు దానిని తవ్వించుకునేందుకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద సాయం పొందే అవకాశం ఉందన్నారు. సంపూర్ణ స్వచ్ఛతపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె సత్యప్రసాద్, స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్ కె సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు బి కాశీవిశ్వనాథం, వెంకటరమణ పాల్గొన్నారు.

కాసు బ్రహ్మానందరెడ్డికి ఘన నివాళి



కాసు బ్రహ్మానందరెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పిడుగురాళ్ల: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కాసు బ్రహ్మానందరెడ్డి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చింతా వెంకట రామారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుందుర్తి గురవాచారి మాట్లాడుతూ.. నాలుగున్నర దశాబ్దాల పాటు దేశ రాజకీయాల్లో చక్రం తిప్పి, ప్రతి ఒక్కరితో కూడా ప్రశంసలు కురిపించుకున్నారన్నారు. దేశం మొత్తం పల్నాడు వైపు చూసే విధంగా చేసిన యోధడని తెలియజేశారు. సికింద్రాబాద్ కేంద్రంగా దక్షిణ మధ్య రైల్వే మండలం ఏర్పాటు కావడం వెనుక ఆయన కృషి ఉందని తెలియజేశారు.కేంద్ర మంత్రి వర్గంలో 1974వ సంవత్సరంలతో బాధ్యతలు చేపట్టి, కమ్యూనికేషన్, హోం, పరిశ్రమల శాఖలను నిర్వహించారని, నాటి ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి, ఏఐసీసీ అధ్యక్షులు, మహారాష్ట్ర గవర్నర్‌గా, ఒక రాష్ట్రపతి పదవి తప్ప రాజకీయంలో అనేక పదువలను ఆయన ఆధిరోహించారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, చింతా సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు పసులలేటి పవన్, మార్కెట్ యార్డు డైరెక్టర్ జాషువా, అరుణ, పసుపులేటి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు చిరుధాన్య పంటలపై మొగ్గు చూపాలి

ఏడీఏ శ్రీ కృష్ణదేవరాయులు

పిడుగురాళ్ల: ఈ ఏడాది రైతులంతా చిరుధాన్య పంటలపై మొగ్గు చూపితే బాగుంటుందని ఏడీఏ శ్రీ కృష్ణదేవరాయలు అన్నారు. పట్టణంలోని ఏడీఏ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడీఏ కార్యాలయ పరిధిలో రైతులంతా కంది, రాగి పంటలను వేయాలని సూచించారు. అంతేకాకుండా కంది, రాగి పంటలను అంతర పంటలుగా కూడా వేయాలని ఆయన సూచించారు. వీటికి సంబంధించిన మినీ కిట్స్‌ను కూడా ఐదు మండలాల వ్యవసాయశాఖాధికారులకు అందజేయడం జరిగిందని ఆయన తెలియజేశారు. వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చే మినీ కిట్స్‌లో ఐరన్ ఎక్కువగా ఉంటుందని వీటిని ఆహార పంటగా తీసుకోవడం ఎంతో మేలు అవుతుందని తెలిపారు.

మండల గ్రామ సమైఖ్య సంఘ ప్రతినిధుల సమావేశం

కారెంపూడి: మండల గ్రామ మహిళా సమైఖ్య సంఘాల ప్రతినిధుల సమావేశాన్ని మండల పరిషత్తు కార్యాలయంలో డీఆర్‌డీఏ అధికారులు శుక్రవారం నిర్వహించారు. స్త్రీ నిధి, అలాగే బ్యాంకుల నుంచి తీసుకుంటున్న గ్రూపు రుణాలు వాటి చెల్లింపులపై అధికారులు రివ్యూ నిర్వహించారు. డ్వాక్రా యానిమేటర్లు గ్రూపులను సమర్థవంతంగా నిర్వహిస్తూ సభ్యులకు మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. రుణాల చెల్లింపుల విషయంలో వస్తున్న ఆరోపణలపై డీపీఎం హనుమానాయక్ విచారణ చేశారు. అలాగే రుణాలు చెల్లింపులపై కూడా డీపీఎం సమీక్ష నిర్వహించారు. స్త్రీ నిధి రుణ చెల్లింపుల విషయంలో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఆటోమేటిక్ డెబిట్ విధానం తీసుకు వచ్చామన్నారు. దీని ద్వారా రుణ చెల్లింపులు వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కారెంపూడిలోని ఒక గ్రూపు రుణ చెల్లింపులను వీఓఏ వ్యక్తి గత బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకున్నారని వస్తున్న ఆరోపణలు రుజువు కాలేదన్నారు. ఎవరైనా పొరపాటున ఎక్కువ రుణ వాయిదా చెల్లింపులు చేసి ఉంటే అవి వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయి ఉంటాయని గ్రూపు సభ్యులంతా కూర్చుని ఇలాంటివి రాకుండా చూసుకోవాలని హితవు పలికారు. సభ్యులు చెల్లిస్తున్న చెల్లింపులకు సంబంధిత గ్రూపు ప్రతినిధులు యానిమేటర్లు జవాబుదారీ వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే రుణాలు తీసుకున్న వారు కూడా చెల్లింపుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమావేశంలో ఏజీఎం బుల్లయ్య, స్త్రీ నిధి ఏజీఎం బుల్లయ్య, ఏపీఎం శివ కుమార్, సీసీలు, వీఏఓలు పాల్గొన్నారు.

వర్షాకాలంలో కరెంటు స్తంభాలతో అప్రమత్తంగా ఉండాలి

కారెంపూడి: వర్షాకాలంలో విద్యుత్తు స్తంభాలకు అలాగే కరెంటుకు సంబంధించిన వస్తు వినియోగంపై చాలా అప్రమత్తంగా ఉండాలని కారెంపూడి ఏఈ కె కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉరుములు, మెరుపుల సమయంలో కరెంటు సర ఫరా నిలిపేయడం ఉత్తమమన్నారు. అలాగే వర్షం పడేటప్పుడు గృహోపకరణాల వినియోగం నిలిపివేసి స్విచ్‌లు ఆఫ్ చేయాలని సూచించారు. కరెంటు లైన్ల కింద సెల్ ఫోన్ మాట్లాడవద్దని, కరెంటు స్తంభాలకు స్టే వైర్లకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే విద్యుత్తు లైన్లకు చెట్ల కొమ్మలు తాకుతున్నట్లయితే ఆ చెట్టును తాకవద్దని అలాంటి సమాచారం తమ శాఖకు అందించాలని కోరారు. పొలాలకు వెళ్లినప్పుడు రైతులు మోటర్ల స్విచ్‌లు ఆన్ చేసే సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని అలాగే తెగిన వైర్లను డామేజ్ అయిన కరెంటు తీగలను గమనించి సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా చిన్నపిల్లలు కరెంటుకు సంబంధించి వినియోగించే ఏ వస్తువును తాకకుండా జాగ్రత్త వహించాలని ఏఈ కోరారు.

ఆటోబోల్తా..ముగ్గురికి గాయాలు



రెంటచింతల: మండలంలోని పశర్లపాడు గ్రామ సమీపంలోని గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోబోల్తా పడి ముగ్గురు గాయపడిన ఘటన చోటు చేసుకుంది. పశర్లపాడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు ఆటోలో జెట్టిపాలెం గ్రామ శివార్లో పొలం పనులకు వెళ్తుండగా ఆటో అదుపుతప్పి బొల్తాపడినట్లు బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంలో మీరావత్ మల్లేశ్వరిబాయి, గంగా, రామ లక్ష్మి గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన మీరా బాయిని పిడుగురాళ్ల పట్టణంలోని ఓ ప్రవేటు ఆస్పత్రికి తర లించగా మిగిలిన ఇద్దరికి గ్రామం లోనే చికిత్స చేయించినట్లు గ్రామస్తులు తెలిపారు.